# కణ్వాశ్రమం

"అబ్బాయ్...."

"ఓరి నాయనా...."

"కొంప నట్టేట్లో కలిసిపోయిందిరా. ఏం రాత, బ్రహ్మరాత. ఉలకవు, పలకవు, నిన్ను కాదన్నట్లు? అలా బుద్ధావతారంలాగా మెదలకుండా దిక్కులు చూస్తూ ఊరుకుంటా వేమిరా? నీకు చీమ కుట్టినంతైనా లేదేంరా?"

"లేకేమమ్మా, చీమలేమిటి, చెవిక్రింద జెర్రులు పుట్టి పెడివితి; పనసంతా ఏకరువు పెట్టడం అయిందా, ఇంకా ఏమన్నా కురదలా వున్నదా?....ఉంటే, ఊః కానీయ్ మాంచి శ్రుతితో ఎత్తుకున్నావు!"

"కానీ—ఇంతకు ఇంతా ఈ జన్మలోనే అనుభవిస్తున్నా, ఇంకా బుద్ధి రాదాయెను; ఇంతేలే, ఇహ...."

"అంతేలే....పెద్దదానవు, కన్నతల్లి వి, నీ దీవన ఊరికే పోతుందా?........ నా కోరిక అదే!"

"ఎందుకుపోతుంది? నీ బుద్ధి ఎన్నడైతే ఇలా పెడతల బట్టిందో, ఆనాడే నాకు కానివాడవైనావని ఓ శోకంపెట్టి ఊరుకుంటేనో, నా చేసిన చేతంతా గంగలో కలిసింది. నీ నిర్వాహకత్వానికి, సంబరాలు పడుతూ, చంకలు గుద్దుకుంటూనే వున్నాను—నీవు చెడేది కాకుండా, నిక్షేపాలకుప్ప - పండంటిపిల్లను పాడుచేస్తివి కదరా—"

"నీవు బాగుచేయడం లేదమ్మా పోనీ—?"

"అన్నీ చేశాను. ఒహటే తరువాయి; ఈ యింటికి నిప్పుపెట్టి, లోతు చూసు కుని పెద్ద కృష్ణలో దిగుతాను—"

"నీ దయ—"

"దయా దగబోలాను కూతురు తగులుకుపోయినా—"

"అలా దోవలోకి రా, మరి; అదా సంగతి? ఇందాకటినుంచీ, ఈ మహా దాశీర్వచనం కాకుండా, అక్కడనుంచే ఎత్తుకుంటే కథ, మన యిద్దరికీ ఈ హైరా నంతా తప్పేదా? పోనీలే—దానికేంలే, లేచిపోయిందీ?"

"ఆహా—ఢంకామీద దెబ్బతీసి...."

"బజాయించే సత్తువ పసిది దాని కెక్కడిదమ్మా—ఎవరితో—"

"ఎవరున్నారు....ఆ యింటి కెదురుగుండా చచ్చిన వాడితోనే! అంతకన్న ప్రయోజకు లెవరు యీ వాడకట్టున? అమ్మ శక్తి ఆ జగజ్జంత్రి దేశదేశాలా అందరి కొంపలూతీసి ఈ పట్నం పావనం చేయడానికి యిక్కడ వెలిసింది. కొడుకును అచ్చుపోసి వదిలింది వూరిమీదికి. అయినా ఎందుకులే ఇంతకూ మన బంగారం మంచిది కానప్పుడు—ఇంకొకరి ననపలసినపని లేదు. తోడివాళ్ళలాగా లక్షణంగా పెళ్ళి పెటాకులూ ఏడ్చి, మొగుడిచాటున పడివుండి, మానవతి అనిపించుకునే రాత, దాని నుదుట రాయలేదు. ఛీ—కుల నాపకురాలు. బిడ్డలు పుట్టగానే సరా?"

"ఈ మాటలన్నీ అనడం....నీ విలా ఆడిపోసుకోవడం — మన లక్ష్మి సుందరాన్నేనా?"

"ఇంకోళ్ళనీ—ఇంకోళ్ళనీ అనడానికి, నే నేమంత కండకావరం, మద మత్సరంతో పడిపోతున్నానటరా? మానానికి మగ్గుతూ ఇపవుతుంటేనే ఇంతింత మాత్రంగా వుంది – భూదేవికి భారంగా యీ మొండిజీవాన్ని - 'పోవే రండా, నీ కర్మం ఇంతే'నని ఇక్కడ పారేసి, ఆ మహారాజు పుణ్యాత్ములు కనుక కళ్ళు మూసుకున్నారు. నా రాత ఇలా భగ్గుమన్నది. ఏం చేతునురా తండ్రీ! — ఈ నింద ఎలా భరించేదిరా?—"

"నీ వెందుకమ్మా భరించడం?—నీ కూతురా, నా కూతురా?—"

"నా కూతురైతే నేను యిలా వూరుకునేదాన్నా....పొత్తిళ్ళలోదాన్నే గొంతు నులిమి పారేసేదాన్ని—"

"నా కా దివ్యదృష్టి లేదు. అంత సాహసము లేదు."

"నీవా—నీకా....నీ తీరు ఒహటి తిన్నగా మండింది కనుక యివి తక్కువై నాయని ఏడుపా? నిప్పంటి వంశంలో - చెడబుట్టారురా—"

"ఈ భాగోతం చాలించవమ్మా తల్లీ, ఇంతటితో నీకూ నీ పెద్దలకూ వెయ్యేల దక్షాలు—ఎక్కడకు లేచి పోయిందంటావు?"

"ఎక్కడికా—నడి గోదావరిలోకి - ఎక్కడికైతేనేం, తెగిన గాలిపడగ—"

"ఎప్పుడు వెళ్ళింది?"

"ఏమో, కన్నానబోయి కన్నానవచ్చే నేర్పుంది దానికి; ఎప్పుడు దూసుకుందో? ఎన్నాళ్ళనుంచి యీ ఆలోచన చేస్తూందో, పన్నాగం పన్నుతూందో? వీధి పాచి చేయడానికి, కోడి కూయగానే లేచి యివతలకు వచ్చాను. మండువా దగ్గిర పక్కమీద పిల్ల లేదు. ఇదేమా అనుకుంటూనే, ఒకవేళేమన్నా నీ దగ్గర కూర్చుని చదువు ఏడుస్తూందేమో అనుకున్నాను—యీ చదువులే కొంపకు యిన్ని తిప్పలు తీసుకువచ్చినాయి - లోకం కళ్ళు మూస్తామటరా, అప్పటికప్పుడే గుప్పుమన్నది. పువ్వు పుట్టగానే పరిమళించదూ?—నన్ను చూపించి, మన పక్కయింటి భడవా వుందే – దాసీ దానితో గుసగుసలు మొదలుపెట్టింది. ఎదటింటి గంగానమ్మ లోపల లోపల పిసుక్కుంటూ మొగుడు వెధవాయకు ఏదో నూరిపోస్తూంది. కొంపమీదకు దండోరా పంపుతుంది కాబోలు! రానీ—'పెళ్ళాన్ని వంచుకోలేని చెవలవాజమ్మా! తగుదునమ్మా అంటూ ఏ ముఖం పెట్టుకుని నా గడప తొక్కావురా?' - అని బిందెనిండా ఒత్తుగా కలిపి నెత్తిన దిమ్మరిస్తాను—తాట ఒలిపిస్తాను - ముండ ఏలుతున్నదిరా, రాజ్యం?-"

"మన వియ్యంకుడికే—యీ మర్యాదలన్నీ?"

"వియ్యంకుడా? వీడి నెత్తురు కళ్ళజూడకుండా వదులుతావురా?—పౌరుషం లేక బ్రతికేమిరా? ఎలా పుట్టావురా - ఆ సింహం కడుపున, ఇంత వెన్నుపాము చచ్చిన వెధవ్వి! వీడు - వియ్యంకుడా? వాడు-అల్లుడా? ఉహూఁ-నీకు యిష్టమేనా, కూతురు దేశంమీద తగులుకుపోవడం?—"

"ఆహాఁ—"

"విచారం లేదురా?"

"లేకేమమ్మా—"

"కడుపు తరుక్కుపోతూందిరా! అన్నీ ఉడిగి, నేడో రేపో అంటూ సిద్ధంగా కాళ్ళు జాపుకొన్న నాకే నవనాడులూ కుంగుకుపోతుంటే; కన్నకడుపు, నీకు ఉండదటరా, తండ్రీ!—ఎలా పుట్టిందిరా దీనికి యీ బుద్ధి—కాగడావేసి గాలించినా, ఇరుపార్శ్వాలా, మన వంగసాల్లో ఎన్నడూ యిటువంటిది లేదే? - ఇంతకూ, ఏ కాలానికి ఏం రానున్నదో తెలియదుకదా? - ఊరుకో నాయనా, విచారపడి మాత్రం ఏం చేస్తాము? - చెయిజారిపోయిన తరువాత—"

"నేను అందుకు కాదమ్మా ఇదవడం—నాతో చెప్పి వెళ్ళిందికాదే అని—"

"చెపితే—"

"రాజాంగంగా పంపించేవాడిని; నా ముచ్చట తీర్చి, నా కూతురూ నా అంతదైందికదా అని సంబరపడి, దీవించే వాడిని 'సుఖంగా వెళ్ళు తల్లీ' - అని—"

"హుఁ - నీ ముచ్చట ముక్కలుగానూ, ఇదెక్కడ కొయ్యమతంరా నీది? ఇదా నీవు చెప్పిన చదువు - నీ పెంపకం ఇదా? అంత ముక్కువున్న వాడివైతే - నడివీధిలో గుడిసె వేయించి, గుమ్మం ముందు కాపలా కూర్చోలేకపోయినావూ?—చిన్నతనంలో పెళ్ళాం పోగానే 'మళ్ళా ఓ యింటి వాడవు అవరా' అని శతవిధాల పోరినా—ఎవరు చెప్పినా వినకుండా - ఆ పసిగుడ్డును పెంచి పెద్దదాన్ని చేయడమే తప్ప - 'నా కోరికలన్నీ తీరిపోయినాయి, ఇంతవరకూ అనుభవించిన భోగం ఇక యీ జన్మానికి ఎక్కి దక్కి....' అని వేదాంతం పేలగొడితివే? మళ్ళా ఈ కాలానికి భీష్ములవారు అవతరించారుగదా అని మురిసిపోతిని గదరా - ఇదా అయ్యా, నీవు తల పెట్టింది-?"

"తలపెట్టడానికేంలే—తరించాను. ఎంత సుకృతం అమ్మా!"

"పచ్చికలి—భగ్గున తగులడుతూంది."

"పరమాత్మని లీల—"

"ఛీ—అప్రాచ్యుడా...."

"అదే—దీవన అమ్మా."

## 2

"నాన్నా !"

"ఏం తల్లీ....మూడు నెలలకా యీ ముసలిపాప, మాట జ్ఞాపకం రావడం మీకు—పోరుపట్టి మారాం చేస్తాడేమోనని - అవ్వ దగ్గర వదిలేసి మీ దోవను మీరు చక్కా-పోయారు కదా - ఆవిడకు నా ముద్దూ మురిపం ఏం చూపించను—"

"నాన్నా—నా మీద కోపమా?"

"కాదమ్మా—ఎంత కసి అనుకున్నావు మీ మీద—తగని ఉక్రోశంగా వుంది. నన్ను తీసుకెళ్ళకుండా బెంగుళూరు వెళితే—"

"నాన్నా—నన్ను క్షమించవా?"

"ఉహుఁ—అవాళ తెల్లవారగానే ఆ ప్రబుద్ధుడు మీ మామగారు వచ్చి నా ఎదుట ఓ అరగంట భరతాభినయం చేశాడమ్మా - తెలియనివాడు కాదుకదా అని నేను మామూలుగా మాటాడుతూంటే - అది క్రమంగా కథాకళిలోకి దిగింది. ధోరణి ముదిరి, రామలీలగా మారేదేకాని....యీ లోపుగా నాకు అసలు కీలకం అర్థం అయింది. నా లెక్చరు అంతా వింటాడు, తల ఊగించి అవునంటాడు. అలా ఎవరికి వారు ఏరి కోరి వరించి....ఎవరితో చెప్పకుండా, గాంధర్వం దోవ నడవడమే ఉత్తమ మంటాడు....నా అంతవాడి కూతురిని....నీ అంత అందకత్తెను, యోగ్యు రాలిని చేపట్టడం....తన పిల్లవాడి అదృష్టమే అంటాడు....కాని....అన్నీ అంటూనే ఇంకా మెదడును బొబ్బట్ల మడతవేసి....ఆ సందున ఏదో దాస్తున్నాడు....చెప్పించే టప్పటికి, తాతలు....మీ తాతలు కాదు, మా తాతలు....దిగి వచ్చారు...."

"ఏమన్నారు...."

"అన్న మాటకు....నాకు కోపం రాలేదమ్మా....విని, నీవూ నవ్వుతానంటే చెపుతాను...."

"సై—"

"తన ముచ్చట తీరాలన్నాడు....'రైటో' అన్నాను...."

"ఏమని...."

"పాపం ....ఆ అమాయకుడేం కొండమీది కోతిని క్రిందకు దించమన లేదమ్మా....జానెడు కాగితంమీద....కలంతో కరపిరలాడించి .... కన్నులపుకో మోకు....కందుతుంది...."

"నాకు అర్థమయిందిలే."

"కాలేదులే....అసలు మజా ఇంకా వుంది. నేనో గమ్మత్తు చేశాను.... గాంధర్వమైనా కట్నం యివ్వక తప్పదని నసిగాడా....నేను సంతకంచేసి....కలం చెక్ బుక్ ఆయనకు అందించాను....ఆ ధీరుడు అటుచూసి, యిటుచూసి....పళ్ళు బిగ బట్టి....అయిదు వేలు వేసుకున్నాడమ్మా...."

"అన్యాయం—"

"కాదూమరి, ఆ మాత్రం ఇంగితం ఉండవద్దూ....రవ్వల దుద్దులు చేయించు కుంటూ — రాగితో గూడుకట్టమంటూ పురమాయించే అవివేకం....ఎవరికైనా అసహ్యం వేస్తుంది. నిజంగా నాకు కోపం వచ్చింది. చెప్పొద్దూ! అది చించే శాను...."

"మంచిపని చేశావు."

"ఆహా, మరి అలా వదిలిపెట్టి ఊరుకుంటానా! లేకపోతే....పదిహేనువేలకు దమ్మిడీ తక్కువ పుచ్చుకుంటే అది నీకు ఇన్సల్టు కాదమ్మా...."

"ఇదా ఘనకార్యం...."

"కాదు.... బెట్టుచేసి....చివరకు తీసుకున్నాడనుకో....అప్పుడు, పని పట్టిం చాను. దిమ్మ తిరిగి పోయిందిలే....కిక్కురు మన్నాడనుకున్నావా....నేను మెదల నిచ్చానా అసలు?— బావగారి వరుస బలేబాగా వినియోగించు కున్నాను - వెర్రివాడా, ఇంత ఘనకార్యం చేసి యిలువరుస నిలిపింది నా కూతురు కాని నీ కొమరుడు కాడోయ్! రివాజు ప్రకారం అయితే, కొనేవాడు మణిని వెతుక్కుంటూ రావాలి — అదీ సబబు; జరిగిందేమిటో తెలుసునా....కాశీమజిలీలు చదివావు కదూ, ఏదో రాజు

కూతురు, కాలవలో స్నానం చేస్తూంటే ఒడ్డున విడిచిన కంఠహారాన్ని గద్ద తన్నుకు పోయింది....నీవా....పిల్లవాడి ఉగ్గుపాలనాటి నుంచీ లెక్కకట్టి సాలుసరి కాంపౌం డుతో వసూలు చేయడానికి ఎవడు దొరుకుతాడా అని కాచుకొని కూర్చుంటివి—నీది అదీ ధ్యాస: మన సంగతా....అమ్మాయి, తనకు తానై అనువుగా ఒక యింటిది కావాలి—అంతేకాని, మన మెద డేమాత్రమూ దాని అభిరుచితో మిలాయించ కూడదు....అద్దరి నీవు—ఇద్దరి నేను....మధ్య వెన్నెల యేటిలో మునకలు వేస్తూ మీ వాడు....ఉక్కిరి బిక్కిరి అవుతాడే కాని, ఒడ్డుకు ఎక్కలేడు. అమ్మాయి చేయి అందించింది-అపును మరి .... "కాంతుడు సిబ్బితి కాడై కాంతయు అట్లయిన" ఆ వరుని రానీకుండా చూశావా, చేసింది చొరవ....అలా వెలాతెలా బోతావేం...."శహ బాస్ అనక....!" ఇలా తుపాను లేపేశానమ్మా - ఇక అక్కడ నిలిస్తే ఒట్టు! తోక ముడుచుకుని అదే దౌడు. మూడురోజుల దాకా తలచుకు-తలచుకు నవ్వుకొన్నాను... ఆయనమీద కోపం అంతా పోయిందమ్మా-అమాయకుడు-క్షమించాను."

"మరి, నన్ను.... ?"

"ఉహుఁ....ఇందాక చెప్పలేదూ....ముసలివాణ్ణి అయిపోతానా నేడో రేపో.... ఇంతమందినీ క్షమించే ఓపిక లేదు నాకు....అదే పనుకున్నావా ఏం....చేతనై తే.... అదుగో వరండాలో కూర్చుని....తన్ను మరచిపోయినావేమోనని బెంగతో తొంగి చూస్తున్నాడే....ఆ ధీరుణ్ణి....చెవులు మెలేసి....బై దీలాగా నా ముందు తీసుకువచ్చి నిలుపు....చేతనై తే....తల ఎత్తి గర్వంగా చిరుమీసం మెలివేసి....తన ధన్య - వాదాన్ని ఆలపించమను....అప్పుడు మీ యిద్దరినీ....దీవించుతాను....ఊఁ....అయిదు నిమిషాలకన్న వ్యవధి యివ్వను....చలో...."

"నాన్నా...."

"—నా దగ్గిర ఇలా ముద్దులు కుడుస్తూంటే....నీ నాథుండు .... చూశావా నన్ను విసిగించావా అంటే అన్నీ యిలాటి గ్రాంథిక ప్రయోగాలే చేసి....కసి తీర్చు కుంటా....పోనీలే దీవన....తీరుబడిగా జరగాలిసింది కనుక—వాయిదా వేద్దాం.... నన్నిక కదపమోక....ఆ రణగొణ ధ్వనంతా అతని చెవి దగ్గిర....అలా తోటలో తిరుగుతూ....నీ యిష్టం వచ్చినంత సేపు చెయ్యి. నే నివాళ యీ కథ పూర్తిచేసి పంపకపోతే....ఇంకా ఏమన్నా వుందా, సుందరం! తెలుగుదేశం యావత్తూ, కేవలం తలక్రిందు లౌతుంది—"